క్లుప్తంగా

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



కొత్తకోట: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ హరిహర పుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్రం ఆలయ నిర్మాణానికి హైదరాబాద్‌లో స్థిరపడిన కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామానికి చెందిన కలకొండ మనిమాల జయప్రకాష్ దంపతులు రూ. 2,51,116 విరాళాన్ని అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు ధూపం నాగరాజుకు అందజేశారు. సందర్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు శాలువాతో సన్మానించి వారికి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో పొగాకు రాఘవేంద్ర ప్రసాద్, నారాయణ్‌దాస్ విశ్వమోహన్ చారి, భీమ అమృతరవి, గుడిబండ నాగిరెడ్డి, వేణు, నరహరిచారి, గన్నోజి వెంకటేష్, మురళి, తాజ్‌మోల్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు సింగిల్ విండో చైర్మన్ జగన్నాథంనాయుడు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు యాదవ్, మాజీ సర్పంచ్ సత్యంయాదవ్ కలిసి మొదటి బహుమతి రూ.30వేలు, రెండో బహుమతి రూ.20 వేల నగదు బహుమతి, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు మద్దిలేటి, చంద్రాయుడు, ఆంజనేయులు, బాలరాజు, చిన్న ఆంజనేయులు, యాదగిరి, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



అమరచింత: పట్టణానికి చెందిన మరెడ్డి భరత్ రెడ్డి 15 రోజుల క్రితం రైలు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీఎస్.గోపి, రాజు, బుచ్చన్నలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు



పాన్‌గల్: యువతి అదృశ్యమైన ఘటనపై సోమవారం కేసు నమోదైనట్లు ప్రొహిబిషన్ ఎస్ఐ హిమబిందు తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లాయిపల్లికి చెందిన చింత కుంట బాలమ్మ, బాలయ్య కుమార్తె దీపిక(19) ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈనెల 4న తల్లిదండ్రులు కూలీ పనుల కోసం వెళ్లగా దీపిక ఇంట్లోనే ఉంది. తల్లిదండ్రులు కూలీ పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో కుమార్తె కనిపించకపోవడంతో చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించ లేదు. సోమవారం యువతి తల్లి బాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి



కేటీదొడ్డి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రైనీ ఎస్ఐ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పోతులపాడు నుంచి అలంపూర్ చౌరస్తాకు అనుమతులు లేకుండా టిప్పర్‌లో మట్టిని తరలిస్తుండగా బ్లూకోర్టు పోలీసులు ఖాదార్, రవీంద్ర పట్టుకున్నారు. టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించి, టిప్పర్ డ్రైవర్ కర్నూల్‌కు చెందిన జింకల ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



వెంకటాపురంలో శిథిలావస్థకు చేరిన ట్యాంక్



అప్పాయిపల్లిలో ట్యాంక్ పిల్లర్‌కు తేలిన ఇనుప చువ్వలు



నాచహళ్లిలో ఇలా..

- శిథిలావస్థకు చేరిన ఓహెచ్‌ఆర్ ట్యాంకులు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

వనపర్తి రూరల్: 30 ఏళ్ల క్రితం తాగునీటి సౌకర్యార్థం గ్రామాల్లో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంకులు నేడు శిథిలావస్థకు చేరి ప్రజలను భయాందోలనకు గురి చేస్తున్నాయి. అంతేకాకుండా కొన్ని ట్యాంకులకు పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల ట్యాంకుల అడుగు భాగాన ఇనుప చువ్వలు తేలి ప్రమాదభరితంగా మారడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. అయినా సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని నాచహళ్లి, అప్పాయిపల్లి, వెంకటాపురం గ్రామాల్లోని పాఠశాల ఆవరణలో తాగునీటి సౌకర్యార్థం నిర్మించిన ఓహెచ్‌ఆర్ వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరడంతో నీటిని కూడా నింపడం లేదు. పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ట్యాంక్ ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ట్యాంక్‌ను తొలగించాలని కోరారు. అప్పాయిపల్లిలో ట్యాంకు పిల్లర్లు, అడుగు భాగంలో సీకులు తేలి పెచ్చులూడుతుంది. ఎర్రగట్టుతండాలో తాగునీటి ట్యాంక్‌కు ఉన్న మెట్లు శిథిలమై పడిపోతున్నాయి. ప్రమాదకరమైన ట్యాంకులను మరమ్మతులు చేయించాలని, లేదంటే తొలగించి కొత్త ట్యాంకులు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కొన్నింటికి మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

నీరు నింపడం లేదు

గ్రామంలోని పాఠశాల ఆవరణలో ఉన్న తాగునీటి ట్యాంకు పూర్తిగా శిథిలమైయింది. ట్యాంకుకు నీళ్లు కూడా నింపడం లేదు. శిథిలావస్థలో ఉన్న ట్యాంకును ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ముందే స్పందించి తొలగించాలి. – రాముడు, వెంకటాపురం

26 ఏళ్ల కిందట నిర్మించారు

నాచహళ్లిలో 26 ఏళ్ల కిందట 40 వేల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి ట్యాంకును నిర్మించారు. అది ఇప్పుడు శిథిలావస్థకు చేరింది. దానిని పూర్తి నేలమట్టం చేసి నూతన ట్యాంక్ నిర్మాణం చేపట్టాలి. – సురేష్, నాచహళ్లి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



అమరచింతలో కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



ఆత్మకూర్‌లో కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లను అర్హులందరికీ మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు డాక్టర్ కృష్ణ అన్నారు. సోమవారం దరఖాస్తుదారులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శశిధర్‌కు వినతి పత్రం అందజేశారు. పూరిగుడిసెల్లో, కిరాయి ఇళ్లల్లో ఏళ్లుగా నివాసముంటున్న వారికి కాకుండా సొంత ఇళ్లు ఉన్నవారి పేర్లే జాబితాలో పొందుపర్చారని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి అర్హులందరికీ న్యాయం చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..

అమరచింత: ఇందిరమ్మ ఇళ్లనును అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలంటూ మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. పట్టణంలోని 10 వార్డుల్లో నిరుపేదలు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని, వార్డు ఆఫీసర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి కేవలం అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇళ్లు మంజూరయ్యేలా లబ్ధిదారుల ఎంపిక చేశారని దుయ్యబట్టారు. పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వేలలో అర్జీలు పెట్టుకున్నారని, కేవలం 100 ఇళ్లను మాత్రమే మున్సిపాలిటీకి మంజూరు చేయడం తగదన్నారు. మరోమారు విచారణ చేసి అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్‌కు అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నరసింహులుగౌడ్, మాజీ కౌన్సిలర్ రాజ్‌కుమార్, బాలరాజ్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించాలి



ఆత్మకూర్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నిర్వాహకులు



దుప్పల్లిలో..

ఆత్మకూర్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను, వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సోమవారం స్థానిక బాలికల పాఠశాలలో అవోపా, క్లాస్‌మేట్ క్లబ్ వారి ఆధ్వర్యంలో సత్కరించారు. అలాగే యంగ్‌ఇండియా సమ్మర్‌క్యాంపును ప్రారంభించారు. నిఖిల్ 559, హర్షిత, పూజ 532, వైష్ణవి, శివలీల 531, మల్లీశ్వరి 521, అనిత 503 మార్కులను సాధించారని కొనియాడుతూ నగదు పురస్కారంతో సత్కరించారు. అలాగే వందశాతం ఫలితం సాధించిన తిప్పుడంపల్లి పాఠశాల జీహెచ్ఎం రాజేంద్రప్రసాద్, ఉర్దూ మీడియం జీహెచ్ఎం అనంతరాములను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలరాజు, అవోపా, క్లాస్‌మేట్ క్లబ్ నిర్వాహకులు నాగరాజు, చంద్రశేఖర్, వీరన్న, సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, ఇందిరాదేవి, నాగప్రియ, విజయభాస్కర్‌రెడ్డి, రియాజ్, విజయప్రకాష్, సత్యం తదీతరులు ఉన్నారు.

మదనాపురం: దుప్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రియాంక పదో తరగతి ఫలితాల్లో 517 మార్కులు సాధించడంతో విద్యార్థినిని అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సుధామణి, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ గుప్తా, ఉపాధ్యాయులు రాజు, మూలే ఆంజనేయులు, ఇషాక్‌పాషా, తిరుపతయ్య, శ్రీలక్ష్మి శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థి తండ్రి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం



పాన్‌గల్ ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

పాన్‌గల్: కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల అసోసియేషన్ల పిలుపు మేరకు ఈనెల 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ సూర్యవంశ రాము అన్నారు. తెలంగాణ జీపీ ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ గోవింద్ రావుకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మహేష్, తిరుపతయ్య, బాలస్వామి, అర్జునయ్య, చంద్రశేఖర్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ, ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారద, అరుణ, తార, సువర్ణ, మాధవి, శారదాదేవి, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అంజన్న, రాములు, తిరుపతన్న, చంద్రయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతు కార్డుల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఖిల్లాఘనపురం: రైతుల సంక్షేమ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అందిస్తున్న రైతు కార్డు కోసం ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో క్లస్టర్ల పరంగా రైతువేదికల్లో ఈ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ ఆధార్‌కార్డులతో పాటుగా అనుసంధానం చేసిన సెల్‌ఫోన్ తీసుకుని ఏఈఓ లను సంప్రదించాలని సూచించారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి మండలంలోని అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం, కమాలోద్దీన్‌పూర్ గ్రామాలు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ గ్రామాల్లో పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా పర్యటించి రైతులకు పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. రైతుల మేలు కోసం ప్రభుత్వం బ్రీడర్ సీడ్ పథకాన్ని మంగళవారం నుంచి రాష్ట్రంలో ప్రారంభిస్తుందన్నారు. ఈ పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో ముగ్గురు రైతులను ఎంపిక చేసి వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహింస్తుందన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



ఆత్మకూర్: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లాటరీ తగిలిందని లేదా ఇతర కారణాలతో వచ్చే అపరిచిత ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దని ఎస్ఐ నరేందర్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక జాతర మైదానంలో క్రీడాకారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరచిత వ్యక్తులకు ఆధార్, బ్యాంక్ ఖాతా, ఓటీపీలను చెప్పొద్దని సూచించారు. హెచ్‌సీ మన్నెపురెడ్డి, సిబ్బంది సురేందర్, భూపాల్, రాములు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కారల్‌మార్క్స్‌కు ఘన నివాళి

వనపర్తి టౌన్: ప్రపంచ దేశాల్లోని శ్రామిక, కార్మిక, నిమ్నకులాల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసిన మహనీయుడు కారల్ మార్క్స్ అని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. కారల్ మార్క్స్ జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకంటి నరసింహశర్మ, గంధం నాగరాజు, వంగలినాగరాజు, అమృత్ సింగ్, రాణా ప్రతాప్‌సింగ్, కుశకుమార్, గంధం లక్ష్మయ్య, జైపాల్ స్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి: కేసు నమోదు

ఖిల్లాఘనపురం: పాత కక్షలతో గొడవ పెట్టుకుని మహిళను దుర్భాషలాడిన వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఖిల్లాఘనపురం మండలం తిర్మలాయపల్లికి చెందిన వనం రాజేశ్వరిని తన పాలివాళ్లు వెంకటమ్మ, భాగ్యలక్ష్మి, చిన్నదేవేందర్, రమేష్, వనం పాండు పాలం, ఇళ్ల విషయంలో తగాదా పెట్టుకుని పరుశపదజాలంతో దూషించి కొట్టారన్నారు. ఘటనపై వనం రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి కూలీలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ప్రసాద్

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలను అన్నివిధాలుగా ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని బాలకిష్టాపూర్‌లో ఉపాధికూలీలతో సమావేశమయ్యారు. ఉపాధి పనుల చోట కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో కూలీలు ఎండకు తట్టుకోలేక అల్లాడిపోతున్నారని, కనీసం తాగునీరు సమకూర్చడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. 200 రోజులకు పనిదినాలకు పెంచాలని, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, ఉపాధి కూలీలకు రోజుకూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీలోని మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని కోరారు.

ప్రజల పక్షాన పోరాటమే సీపీఐ లక్ష్యం



నాగపూర్‌లో మాట్లాడుతున్న విజయరాములు

గోపాల్‌పేట: ప్రజల పక్షాన ఉండి వారి ఇబ్బందులను తొలగించేందుకు సీపీఐ కృషి చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయరాములు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్ అన్నారు. సోమవారం మే డే వారోత్సవాల్లో భాగంగా గోపాల్‌పేట మండలంలోని ఏదుట్ల, రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామాల్లో జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రం ఒక్క కలం పోటుతో నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని దుయ్యబట్టారు. ఈ లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకోలేరని, సమ్మె చేసే, పనికి తగిన జీతం అడిగే హక్కులను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చామని ప్రతిఒక్కరూ మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఆయన వెంట జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రయ్య, గోపాలకృష్ణ, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నకుర్మయ్య, కురుమూర్తి, కరీం, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్‌కు తరలిన మాస్‌లైన్ పార్టీ నాయకులు



మక్తల్‌కు వెళ్తున్న మాస్‌లైన్ పార్టీ నాయకులు

అమరచింత: మక్తల్ పట్టణంలో సోమవారం షాహిద్ భగత్‌సింగ్ కాంస్య విగ్రహా ఆవిష్కరణకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నాయకులు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. ఈసందర్భంగా మాస్‌లైన్ పార్టీ మండల కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ భగత్‌సింగ్ విగ్రహా ఆవిష్కరణకు భగత్‌సింగ్ మేనల్లుడు జగన్మోహన్‌సింగ్ హాజరయ్యారన్నారు. భగత్‌సింగ్ ఆశయ సాధనలో నేటితరం యువకులు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో కురుమన్న, ప్రేమరత్నం, మన్నెమని పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



వీపనగండ్లలో విద్యార్థులకు యోగా నేర్పిస్తున్న ఉపాధ్యాయులు



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ నిర్వహణలో భాగంగా మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శ్రీనివాసులు, కాంప్లెక్స్ హెచ్ఎం విజయ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు అన్ని రకాల ఆటలు, పాటలు, స్పోకెన్ ఇంగ్లిష్, యోగా వంటి వాటిలో వలంటీర్లు శిక్షణ ఇస్తారన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని, 6వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు మద్దిలేటి, నర్సింహ, సీఆర్పీ గోవింద్‌నాయక్, వలంటీరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పలు క్రీడలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించినట్లు ప్రధానోపాధ్యాయుడు భానుప్రకాశ్ తెలిపారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన క్యాంపులో కమ్యూనికేషన్ స్కిల్స్, బేసిక్ మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, యోగా, పెయింటింగ్, చిత్రలేఖనం, క్యారమ్స్, చెస్, వాలీబాల్ లాంటి అనేక అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ మంగమ్మ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ చిట్టెమ్మ, సీఆర్పీ వెంకటేష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కార్మికుల హక్కులు కాపాడుకుందాం'



పాన్‌గల్: కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు అందరూ కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాల నాయకులు వెంకటయ్య, భగత్, భాస్కర్ అన్నారు. మేడే ఉత్సవాలల్లో భాగంగా సోమవారం మండలంలోని రేమద్దులలోని వరి కొనుగోలు కేంద్రాల్లో కార్మికులతో కలిసి సీఐటీయూ, సీపీఎం జెండాలను ఆవిష్కరించారు. దీంతో పాటు కారల్ మార్క్స్ జయంతిని పురస్కరించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించా. కార్యక్రమంలో వెంకటయ్య, నిరంజన్, చంద్రశేఖర్, మల్లేష్, ఖాజా, మహేష్, కమల్, భాస్కర్‌గౌడ్, బాలకృష్ణ, లక్ష్మణ్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

రైతులకు మొక్కలు, ఎరువులు అందజేత

అయిజ: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేద్రీస్ సంస్థ నిర్వాహకులు సోమ వారం మండల కేంద్రంలోని కార్యాలయంలో రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు, ఎరువులు పంపిణీ చేశారు. అయిజ, ఇటిక్యాల, గట్టు మండలాలకు చెందిన రైతులు పండ్ల తోటలు సాగుచేసేందుకు ఉచితంగా మొక్కలతో పాటు, సేంద్రీయ, రసాయనాల మందులు, పచ్చిరొట్ట సాగుకు నవధాన్యాల విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం చైర్మన్ సుధాకర్‌గౌడ్, డైరెక్టర్లు వెంకటేష్, హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

